క్లుప్తంగా

వడదెబ్బపై అప్రమత్తం

గరుగుబిల్లి: ఎండలు తీవ్రంగా ఉన్నందున వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎల్.గోపాలరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. వృద్ధులు, చిన్నారులు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఉపాధి వేతనదారులు ఉదయం 10.30 గంటల లోపు పనులు ముగించుకుని ఇంటికి చేరుకోవాలన్నారు. అనవసరంగా ఎండలో బయట తిరగొద్దని సూచించారు. ముఖ్యంగా చిన్నారులను ఆడుకునేందుకు బయటకు పంపించొద్దన్నారు. వడదెబ్బకు గురైతే తక్షణమే చికిత్స అందించాలన్నారు.

ఊపందుకున్న వేసవి దుక్కులు



ఉల్లిభద్రలో పొలాన్ని దుక్కి చేస్తున్న రైతు

గరుగుబిల్లి: మండలంలోని తులసిరామినాయుడువలస, గొట్టివలస, గరుగుబిల్లి, పెద్దూరు, గొల్లవానివలస, ఉల్లిభద్ర, దళాయివలస, ఉద్దవోలు, కొంకడివరం తదితర గ్రామాల్లోని మెట్టుభూములలో వేసవి దుక్కులు ఊపందుకున్నాయి. కొద్దిరోజులుగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పంట పొలాలు దుక్కలకు అనుకూలంగా మారాయి. దీంతో రైతులు సంప్రదాయ పద్ధతులతో నాగళ్లతో వేసవి దుక్కులు చేస్తున్నారు. మరలా వర్షం కురిస్తే గోగుపంటను వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నట్లు రైతులు చెపుతున్నారు. ఇటీవల అడపదడపా కురిసిన వర్షం నువ్వు పంటకు అనుకూలంగా ఉంటుందని రైతులంటున్నారు.

వలంటీర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని 1వ వార్డు వీవర్స్ కాలనీలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీరు పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు తెలిపారు. రిజర్వేషన్ ప్రకారం బీసీ–బి మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని సూచించారు.

అక్షరబ్రహ్మ ఆలయాల్లో పూజలు



నౌగుడలో పూజలు చేస్తున్న గిరిజనులు

సీతంపేట: అక్షర తృతియను పురస్కరించుకుని మండలంలోని అక్షరబ్రహ్మ దేవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జక్కరవలస, నౌగూడ, ముత్యాలు తదితర గ్రామాల్లో ఉన్న అక్షర బ్రహ్మ ఆలయాల్లో అక్షరాలకు పూజలు చేశారు. అలాగే వివిధ రకాల విత్తనాలను సైతం పూజించారు.

బహిరంగ మద్యపానం నేరం

పాలకొండ రూరల్: బహిరంగ మద్యపానం చట్టరీత్యా నేరమని సీఐ మురళీధర్ అన్నారు. పాలకొండ–సీతంపేట రహదారిలో వెలగవాడ, పరుశరాంపురం, సిరికొండ ప్రాంతాల్లో శనివారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారితో పాటు ఆరుబయట మద్యం తాగుతున్నవారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. ఎస్సై బి.శివప్రసాద్, ఏఎస్సై శంకరరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సీపీఎం ప్రచార భేరి



సిరికొండలో సీపీఎం ప్రచారభేరి

పాలకొండ: మండలంలోని వెలగవాడ పంచాయతీ సిరికొండ గ్రామంలో సీపీఎం ప్రచార భేరి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు దావాల రమణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల కోసం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. బీజేపీ చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానలపై చేస్తున్న పోరాటానికి అన్ని వర్గాలు సహకరించాలని కోరారు.

నేడు నవోదయ మోడల్ టెస్ట్

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలిలో ఉన్న తిరుమలసాయి హైస్కూల్‌లో ఆదివారం ఉదయం నవోదయ మోడల్ పరీక్షను నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం కర్రి శ్రీరామ్మూర్తి తెలిపారు. నవో దయ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష లో ఎక్కువ మార్కులు సాధించేందుకు ఈ మోడల్ టెస్ట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మోడల్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులకు, వారి సహాయకులకు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే మొదటి 10 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు.

సంక్షేమ పాలనకు మద్దతుగా..

భామిని, సీతంపేట: ఊరూరా 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నారు. భామిని మండలం దిమ్మిడిజోలలో సహకార సంఘం డైరెక్టర్ కాగితాపల్లి కృష్ణారావు, వలరౌతు రామారావు, చిన్నదిమిలిలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కొవ్వాడ చిరంజీవులు, సర్పంచ్ లోతుగెడ్డ రవికుమార్, పిన్నింటి హరిబాబు. నులకజోడులో సచివాలయ కార్యదర్శి సాపుపిల్లి ఫాల్గుణరావు, ఉపసర్పంచ్ కొన్న తిరుమలరావు ఆధ్వర్యంలో శనివారం విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ చేయగా..ప్రతి ఒక్కరూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు.



భామిని: దిమ్మిడిజోలలో సంక్షేమ పథకాలపై ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



భామిని: చిన్నదిమిలిలో ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న కొవ్వాడ చిరంజీవులు, రవికుమార్



సీతంపేట: ముత్యాలు సెంటర్‌లో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు

ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

● శాప్ సీఈఓ రామ్‌గోపాల్

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో నైపుణ్యం గల క్రీడాకారులను తయారు చేయాలని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ) సీఈఓ బి.రామ్‌గోపాల్ అన్నారు. స్థానిక గ్రీన్‌ఫీల్డ్ స్టేడియాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఇటీవల నిర్మించిన వాలీబాల్, బాస్కట్ బాల్, బ్యాడ్మింటన్ సింథటిక్ కోర్టు, జిమ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను గుర్తించి తగిన శిక్షణ ఇవ్వాలని, వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభించాలని ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకబ్ దయానంద్‌కు సూచించారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు విద్యార్థులను పంపించే విధంగా తయారు చేయాలన్నారు. క్రీడా సామగ్రి అవసరమైతే ప్రతిపాదనలు పెట్టాలన్నారు.



బ్యాడ్మింటన్ కోర్టును పరిశీలిస్తున్న శాప్ సీఈఓ రామ్‌గోపాల్

సమగ్ర సర్వేతో భూరక్ష

పాలకొండ రూరల్: భూముల సమగ్ర రీసర్వేతో భూమి యజమాని హక్కులకు రక్షణ లభిస్తుందని చిన్నకోటిపల్లి సర్పంచ్ సింగంవలస మంగామణి అన్నారు. పంచాయతీ పరిధిలో ఇటీవల చేపట్టిన భూముల సర్వే ప్రాప్తికి శనివారం సర్వేరాళ్లను ఏర్పాటు చేశారు. గ్రామస్తులు, రైతుల సమక్షంలో రాళ్లు ఏర్పాటు చేసినట్లు సర్వే సిబ్బంది చెప్పారు. అలాగే లుంబూరులో సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్ నేతృత్వంలో సర్వేరాళ్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటరరావు, వీఆర్వో శ్రీనివాసరావు, సచివాలయం సర్వేయర్ శ్రీనివాస్, త్రినాథులు తదిరులు పాల్గొన్నారు.



చిన్నకోటిపల్లిలో సర్వేరాళ్ల ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఉపాధ్యాయ సంఘాల నిరసన

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖ అధికారితో పాటు వీరఘట్టం మండల విద్యాశాఖ అధికారి, రేగులపాడు కేజీబీవీ ఎస్ఓ, జీసీడీఓలపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ విధించిన సెస్పెన్షన్ ఎత్తివేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శనివారం నడుకూరులో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కేజీబీవీలో చదివే 8వ తరగతి విద్యార్థులకు గణిత పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదనే విషయంపై సస్పెన్షన్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖ అధికారి, వీరఘట్టం ఎంఈఓ, జీసీడీఓ, రేగులపాడు కేజీబీవీ ఎస్ఓతో పాటు క్రిందిస్థాయి సిబ్బందిపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ సస్పెన్షన్ విధించడంపై ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వెంటనే సస్పెన్షన్‌ను రద్దు చేయాలని కోరుతూ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, జేవీకే కిట్లు అందజేయకుండా అక్రమంగా సస్పెన్షన్ చేయడం ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యేనని మండిపడ్డారు.



వీరఘట్టం: అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉపాధ్యాయ సంఘాల నాయకుల నిరసన

వర్షంతో ఊరట



కురుపాం: మండల కేంద్రంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం

సీతంపేట, భామిని, కురుపాం: మండలాల్లోని పలు ప్రాంతాల్లో శనివారం ఉరుములు, మెరుపులతో పాటు భారీ వర్షం కురిసింది. వేసవి ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనాన్నిచ్చింది. ఆరుతడి పంటలకు, వేసవి దుక్కులకు ఈ వర్షం అనుకూలంగా ఉంటుందని పలువురు రైతులు అంటున్నారు.



భామిని: నేరడిలో కురుస్తున్న వర్షం

ఎమ్మెల్యే దృష్టికి రావాడ సమస్యలు

జియ్యమ్మవలస: మండలంలోని తాళ్లదుమ్మ పంచాయతీ రావాడ గ్రామస్తులు తమ గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దృష్టికి తీసుకువెళ్లారు. చినమేరంగిలోని ఎమ్మెల్యే స్వగృహంలో శనివారం ఆమెను కలిసి సమస్యలు వివరించారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని, ఆర్‌ఓఆర్ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ..జేజేఎం నిధులు రూ.12 లక్షలతో గ్రామంలో తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామని, ఆర్‌ఓఆర్ పట్టాలపై ఉన్నతాధికారులతో మాట్లాడుతానని అన్నారు. వెంటనే తహసీల్దార్‌కు ఫోన్ చేసి ఆర్‌ఓఆర్ పట్టాలపై మాట్లాడగా.. బుధవారం గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎమ్మెల్యేకు చెప్పారు.

టీకాలు వేసేటప్పుడు జాగ్రత్తలు పాటించండి

పార్వతీపురం టౌన్: వ్యాధి నిరోధక టీకాల నిర్వహణలో మార్గదర్శకాలను వైద్య సిబ్బంది తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) టి.జగన్‌మోహనరావు సూచించారు. పట్టణంలోని 22, 23 వార్డుల్లో చిన్నారుల టీకా కార్యక్రమాన్ని ఆయన శనివారం ఆయన పరిశీలించారు. అర్హుల జాబితా, అత్యవసర మందుల కిట్, ఉపయోగించిన సిరంజీలు, ఆర్సీహెచ్ రిజిస్టర్లు, టీకా కార్డుల్లో తేదీలు, మాతా శిశు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించే పోస్టర్లు, బ్యానర్లు తదితర వాటిని పరిశీలించారు. నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.పుష్ప, ఏఎన్‌ఎంలు ఉమా మహేశ్వరి, విజయ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

బలిజిపేట: మండలంలోని పలగర గుడివాడ కాలనీలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. యువజన సంఘం సభ్యులు, స్థానికులు పాల్గొనాలని కోరారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

పార్వతీపురం టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన చోదకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవని అన్నారు. ద్విచక్ర వాహన చోదకులు పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. ఏఎస్ఐ రాజారావు, కిశోర్, సంపత్, ఆటో డ్రైవర్లు, వాహన చోదకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

పార్వతీపురం టౌన్: పార్వతీపురం నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఆత్మ చైర్మన్ యాండ్రాపు తిరుపతిరావు ఇటీవల అనారోగ్యానికి గురి కాగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఆయన ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ బంకూరు రవికుమార్, సర్పంచ్ జక్కు ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుల నియామకం

సీతానగరం: మండలంలోని మూడు పీఏసీఎస్‌లకు నూతన అధ్యక్షులను నియమిస్తూ డివిజనల్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషితో అంటిపేట పీఏసీఎస్ అధ్యక్షుడిగా బొన్నాడ సత్యనారాయణ, తామరఖండి పీఏసీఎస్ అధ్యక్షుడిగా మూడడ్ల మన్మధరావు, ఆర్.వెంకంపేట పీఏసీఎస్ అధ్యక్షుడిగా రెడ్డి సూర్యనారాయణను నియమిస్తూ రాష్ట్ర సహకార సంఘాల అధికారి నుంచి ఉత్తర్వులు వచ్చాయి. వీరంతా ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారి వైద్యానికి సీఎం సాయం

పాలకొండ: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ చిన్నారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.4.50 లక్షలు మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం శనివారం చిన్నారి తండ్రికి అందజేశారు. వీరఘట్టం మండలం తలవరం గ్రామానికి చెందిన దేవకివాడ రాజేష్ ఖన్నా మూడేళ్ల కుమార్తె గీతిక హయాతి నరములకు సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయమై ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెల్లడంతో సీఎం సహాయ నిధి నుంచి రూ.4.50 లక్షలు మంజూరు చేశారు. ఈ చిన్నారికి ఆదివారం ఆపరేషన్ జరుగుతుందని చిన్నారి తల్లిదండ్రులు తెలిపారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న పాలవలస రాజశేఖరం

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్న ప్రతినిధులు

సీతంపేట: మండలంలోని కారిగూడ గ్రామంలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ పాలక నాగేశ్వరరావు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. మోతాదుకు మించి రసాయన ఎరువుల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాల ను, అధిక దిగుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఘనజీవామృతం, ద్రవజీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీఓ గోపాలరావు, సీఓ బి.జగ్గయ్య, బాలరాజు, రవి పాల్గొన్నారు.

రైతులు 30లోగా దరఖాస్తు చేసుకోండి

భామిని: ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన గిరిజన రైతులు ఈనెల 30లోగా రైతుభరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం అన్నారు. మండలంలోని పోలవరం గ్రామంలో సర్పంచ్ బిడ్డిక నారాయణ ఆధ్వర్యంలో రైతులతో శనివారం సమావేశం నిర్వహించారు. గిరిజన కుటుంబంలో వ్యక్తిగతంగా ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా ఉన్న రైతులు కూడా రైతుభరోసా పొందేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఇప్పటివరకు రైతుభరోసా పొందని పల్లం ప్రాంత రైతులు కూడా ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ సహాయకులు గొర్లె ఎలీసా, భవానీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఏఓ సింహాచలం, సర్పంచ్ నారాయణ

భక్తిశ్రద్ధలతో రమజాన్



కురుపాం: శివ్వన్నపేట జమా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కురుపాం: పాలకొండ, కురుపాం నియోజకవర్గంలో ముస్లింలు శనివారం రమజాన్ పండగను ఘనంగా జరుపుకున్నారు. శివ్వన్నపేట జమా మసీదులో మతగురువు మౌలానా సర్దార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారు లు, పెద్దలు ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఒకరినొక రు ఆలింగనం చేసకుంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

పాలకొండ రూరల్: పవిత్ర రమజాన్ పండగను పురస్కరించుకుని పాలకొండ జామియా మసీదులో శనివారం తెల్లవారుజాము నుంచి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇమామ్ (మతగురువు) షేక్ ఇస్మాయిల్ ఖురాన్‌లోని అల్లా సందేశాన్ని వినిపించారు. కులమతాలకు అతీతంగా స్థానికులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

జగనన్నతోనే అన్ని వర్గాల అభివృద్ధి



ప్రజలకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేసి వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: అన్ని వర్గాల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని, అర్హతే ప్రామాణికంగా ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని వెంకంపేట గ్రామంలో శనివారం నిర్వహించారు. ప్రతి గడప వద్దకు వెళ్లి ప్రజలను కలుసుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ఇంతవరకు ప్రభుత్వం వారికి చేకూర్చిన లబ్ధిని, సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే తెలియజేశారు. ఏమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మ ఒడి వచ్చిందా, రైతు భరోసా వచ్చిందా, పింఛన్ ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారా అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందుతున్నాయా.. లేదా.. అర్హులకు ఏదైనా అన్యాయం జరుగుతుందా తదితర విషయాలు తెలుసుకొనేందుకే తాము వచ్చామని వివరించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తుందని తెలిపారు. సచివాలయానికి రూ.20లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించిందని, వాటి ద్వారా పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ శిద్దా జగన్నాధరావు, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, స్థానిక సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యులు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.